సాక్షి ఆదిలాబాద్

బుధవారం | 30 | జూలై | 2025



'మధ్యాహ్నం' ఎప్పుడో?
సర్కారు జూనియర్ కళాశాలల్లో ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకం అమలు చేయడం లేదు. దీంతో గ్రామీణ విద్యార్థులు అర్ధాకలితోనే చదువులు కొనసాగిస్తున్నారు. 8లో▸



నకిలీ ఆయుర్వేదిక్ అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్ 8లో▸
నకిలీ ఆయుర్వేదిక్ వైద్యంతో మోసగిస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను అరెస్ట్ చేసినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు.

గరిష్టం/కనిష్టం
27.0/24.0

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

నాగోబాను దర్శించుకున్న ఎస్పీ



పూజలు చేస్తున్న ఎస్పీ అఖిల్, ఏఎస్పీ కాజల్

ఇంద్రవెల్లి: నాగుల పంచమి సందర్భంగా కేస్లాపూర్‌లోని నాగోబా ఆలయాన్ని ఎస్పీ అఖిల్ మహాజన్, ఏఎస్పీ కాజల్‌సింగ్‌తో కలిసి దర్శించుకున్నారు.మెస్రం వంశీయులు వారిని సన్మానించారు. నాగోబా ప్రతిమలు అందజేశారు.

మహిళల సమస్యలపై శ్రద్ధ వహించాలి
ఆదిలాబాద్‌టౌన్: మహిళల సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మహిళా పోలీసు స్టేషన్‌తోపాటు టూటౌన్‌ను మంగళవారం తనిఖీ చేశారు. స్టేషన్‌కు వచ్చే బాధితులతో గౌరవంగా మెదలాలని సూచించారు. వారి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. పట్టణంలో ఓపెన్‌డ్రింక్ జరగకుండా గస్తీ నిర్వహించాలన్నారు. మట్కా, గుట్కా, గంజాయి, ఇతర అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా పర్యవేక్షించాలని సూచించారు. ఎస్పీ వెంట ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి, టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు, మహిళా స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ప్రేమ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలోని 11 భవిత కేంద్రాల్లో ఫిజియోథెరపీ పోస్టుల నియామకానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డీఈవో శ్రీనివాస్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు ప్రతీ శిబిరానికి రూ.వెయ్యి గౌరవ వేతనం అందించనున్నట్లు పేర్కొన్నారు. బీపీటీ, ఎంపీటీ అర్హత గల అభ్యర్థులు ఇంటర్‌షిప్‌తో పాటు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆగస్టు 4 వరకు దరఖాస్తులను డీఈవో కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. బేల, భోరజ్, బోథ్, గాదిగూడ, జైనథ్, నార్నూర్, నేరడిగొండ, సాత్నాల, సిరికొండ, సొనాల, ఉట్నూర్ మండలాల్లో ఒక్కోటి చొప్పున ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి ఉష్కం తిరుపతిని సంప్రదించాలని సూచించారు.

వైద్యశాఖ డైరెక్టర్‌కు వినతి



డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తూ..

ఆదిలాబాద్‌టౌన్: రాష్ట్ర వైద్యారోగ్యశాఖ డైరెక్టర్ నరేందర్ కుమార్‌ను తెలంగాణ ల్యాబ్ టెక్నికల్ అసోసియేషన్ నాయకుల ఆధ్వర్యంలో ఆ శాఖ జిల్లా ఉద్యోగులు కలిశారు. మంగళవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. పదోన్నతులు కల్పించాలని, ఖాళీగా ఉన్న పోస్టులను అర్హులైన వారితో భర్తీ చేయాలని కోరారు. ఈ మేరకు డైరెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. డైరెక్టర్‌ను కలిసిన వారిలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నిజాముద్దీన్, సంఘ బాధ్యులు రమణాచారి, సమి ఉన్నారు.

విద్యుత్ శాఖలో సింగిల్ విండో వ్యవస్థ

ఆదిలాబాద్: విద్యుత్ వినియోగదారులకు హెచ్‌టీ 11కేవీ, 33కేవీలపై హోల్టేజ్ సర్వీసుల మంజూరు వేగవంతం చేసేందుకు సింగిల్‌విండో వ్యవస్థను ప్రవేశపెట్టినట్లు విద్యుత్‌శాఖ ఎస్‌ఈ జేఆర్ చౌహాన్ ప్రకటనలో పేర్కొన్నా రు. ఈ సింగల్ విండోవ్యవస్థ ద్వారా త్వరితగతిన సర్వీసులు మంజూరవుతాయని పేర్కొన్నారు. ప్రతీసారి ఆఫీసులకు రాకుండా ట్రాక్ చేసుకునే సౌకర్యం సైతం ఉందని వివరించారు. ఈ వ్యవస్థతో పారదర్శకత పెరుగుతుందని, వినియోగదారులు తమ దరఖాస్తుల స్థితిగతులు ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చన్నారు. మొబైల్ ఫోన్లకు ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం అందుతుందని వివరించారు. విషయాన్ని వినియోగదారులు గమనించాలని సూచించారు.

నాగమ్మా.. దీవించు



మొక్కు తీర్చుకుంటున్న మహిళ

గంజ్ పోచమ్మ ఆలయ పుట్ట వద్ద భక్తుల సందడి



పోలీస్ గెస్ట్‌హౌస్ ఆవరణలోని పుట్ట వద్ద..

జిల్లావ్యాప్తంగా నాగుల పంచమిని మహిళలు మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. పుట్టల వద్ద పాలు పోసి నాగదేవతకు పూజలు చేశారు. ఇంటిల్లిపాదిని సల్లంగ దీవించు తల్లీ అని వేడుకున్నారు. ఉదయం నుంచే ఆయా ఆలయ ప్రాంగణాల్లోని పుట్టల వద్ద సందడి వాతావరణం కనిపించింది. – ఆదిలాబాద్

మీనమేషాలు



- చెరువుకు చేప చేరేనా?
- ఇంకా జాడలేని టెండర్లు
- జూలై ముగుస్తున్నా ఊసెత్తని వైనం
- ఆందోళనలో మత్స్యకారులు

జిల్లాలో..
మొత్తం చెరువులు : 240
మత్స్యకారుల సంఘాలు : 101
అందులోని సభ్యులు : 4800 మంది
ఏటా చేపపిల్లల పంపిణీ లక్ష్యం: కోటి 24లక్షలు

ఆదిలాబాద్‌టౌన్: మత్స్యకారులకు జీవనోపాధిగా ఉన్న చేపల పెంపకం విషయంలో మీనమేషాలు కొనసాగుతున్నాయి. ఏటా ఏప్రిల్, మే నెలల్లో టెండర్లు పిలిచి జూలై చివరికల్లా చెరువుల్లో చేప పిల్లలను వదలాల్సి ఉంటుంది. అయితే రెండేళ్లుగా పరిస్థితి భిన్నంగా ఉంది. గతేడాది అక్టోబర్, నవంబర్ మాసాల్లో వదలడంతో ప్రతికూల వాతావరణం కారణంగా అవి ఎదగలేదు. ఫలితంగా ఉపాధి కోల్పోవాల్సి వచ్చిందని, ఈ ఏడాది సైతం అదే పరిస్థితి తలెత్తే అవకాశం లేకపోలేదని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఇప్పటివరకు టెండర్లు పిలవకపోవడం గమనార్హం.

చేపలే వారికి జీవనాధారం..
మత్స్యకారుల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఏటా వంద శాతం సబ్సిడీపై చేప పిల్లలను పంపిణీ చేస్తోంది. గతేడాది నిర్దేశించిన లక్ష్యంలో సగం మాత్రమే చెరువుల్లో వదిలారు. అవి కూడా సగం చెరువుల్లోనే వదలడంతో మిగతా వాటిపై ఆధారపడిన మత్స్యకారులకు ఉపాధి కరువైంది. జిల్లాలో సాత్నాల, మత్తడివాగు రిజర్వాయర్లు ఉండగా, ఆరు పెర్నియర్ ట్యాంకులు, 232 కుంటలు, చిన్న చిన్న చెరువుల్లో చేపల పెంపకం చేపడతారు. రిజర్వాయర్, పెర్నియర్ ట్యాంకుల్లో 80 నుంచి 100 మిల్లీమీటర్ల కట్ల, రవు, మిరిగెల రకం చేపలను వదులుతారు. చెరువుల్లో 35 నుంచి 45 మిల్లీమీటర్ల కట్ల, రవు, బంగారుతీగ చేపలను వేస్తారు. ఇంతవరకు బాగానే ఉంది. జిల్లాలో కోటి 20లక్షల వరకు చేపలను వదలాల్సి ఉండగా, ఇప్పటివరకు టెండర్లే జరగలేదు. గతేడాది 50 శాతం మాత్రమే విడుదల చేశారు. చేప పిల్లలు ఎదగక మత్సకారులు నష్టపోవాల్సి వచ్చింది.

ఈసారి టెండర్లు జరిగేనా..?
ప్రభుత్వం ఏటా మే నెలలో టెండర్ల ప్రక్రియ నిర్వహిస్తుంది. ఈ ఏడాది ఇప్పటివరకు వాటి ఊసే ఎత్తడం లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోని ఏడాది బిల్లులు, కాంగ్రెస్ హయాంలో గతేడాది టెండర్ల బిల్లులు సైతం పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో ఈసారి టెండరుదారులు ముందుకు రావడం లేద ని తెలుస్తోంది. చేప పిల్లలను చెరువుల్లో వదిలేందుకు ఆలస్యమైతే మార్కెటింగ్ ఆలస్యమవుతుందని, తద్వారా నష్టం వాటిల్లుతోందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆగస్టులో చేప పిల్లలను వదిలితే అవి మార్చి నాటికి కిలో నుంచి రెండు కిలోల వరకు ఎదిగే అవకాశం ఉందని, ఆలస్యం కావడంతో 300 నుంచి 500 గ్రాముల వరకు మాత్రమే పెరుగుతాయని చెబుతున్నారు. దీంతో నష్టం వాటిల్లుతుందని వాపోతున్నారు.

మత్స్యకారులకే డబ్బులు అందజేయాలి



ప్రభుత్వం టెండర్ల విధానం వీడి, మత్స్యకారులకే చేప పిల్లల కొనుగోలు కోసం డబ్బులు అందజేయాలి. దీంతో మేలు రకమైన వాటిని కొనుగోలు చేసి చెరువుల్లో వదులుకునే అవకాశం ఉంటుంది. టెండర్ ప్రక్రియ కారణంగా కాంట్రాక్టర్లు సకాలంలో చేప పిల్లలను ఇవ్వడం లేదు. దీంతో గతేడాది నష్టపోవాల్సి వచ్చింది.
– మేకల అశోక్, మత్స్య పారిశ్రామిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు..
ఈఏడాది ఇంకా నోటిఫికేషన్ వెలువడలేదు. టెండర్లు పిలవలేదు. ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు చేపడతాం. టెండర్‌దారులకు సంబంధించి గత రెండేళ్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.
– ప్రభాకర్, జిల్లా మత్స్యశాఖ అధికారి

కొనసాగిస్తారా.. తొలగిస్తారా

- రిమ్స్‌లో రెన్యూవల్‌కు నోచుకోని 54 మంది
- అయోమయంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు
- ఏజెన్సీల మల్లగుల్లాలు
- రోగుల వైద్యసేవలపై ప్రభావం



రిమ్స్ ఆస్పత్రి

ఆదిలాబాద్‌టౌన్: మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా మారింది రిమ్స్ పరిస్థితి. అసలే అరకొర సిబ్బందితో కాలం వెల్లదీస్తుండగా, ఉన్న సిబ్బందిని కుదిస్తూ ఇటీవల ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఎవరిని తొలగిస్తారో.. ఎవరిని కొనసాగిస్తారోనని అయోమయంలో ఉన్నారు. రిమ్స్‌లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సంబంధించి ప్రభుత్వం ఏటా ఏప్రిల్‌లో రెన్యూవల్‌కు సంబంధించి ఉత్తర్వులు జారీ చేస్తుంది. ఇందులో భాగంగా ఈ ఏడాది జూన్‌లో ఉత్తర్వులు విడుదల చేసింది. కొన్నేళ్లుగా రిమ్స్ అధికారులు పంపించిన విధంగా రెన్యూవల్ అవుతుండగా, ఈసారి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ హెల్త్ నుంచి పూర్తిస్థాయిలో కొనసాగింపునకు ఉత్తర్వులు జారీ కాలేదు. టెక్నికల్ సిబ్బందితో పాటు పేషెంట్ కేర్లు, ఇద్దరు అసోసియేట్ ప్రొఫెసర్లను కుదిస్తూ నిర్ణయం తీసుకుంది. అయితే వీరందరిని కొనసాగిస్తారా.. లేక తొలగిస్తారా అనే సందిగ్ధం నెలకొంది. వీరిని తొలగిస్తే రిమ్స్‌లో రోగులకు అందే సేవల్లో ఇబ్బందులు తలెత్తనున్నాయి.

రిమ్స్‌లో ఔట్‌సోర్సింగ్ పోస్టుల పరిస్థితి..			
కేటగిరి	మొత్తం	రెన్యూవల్ అయినవి	కుదించినవి
అసోసియేట్ ప్రొఫెసర్	11	09	02
టెక్నికల్ పోస్టులు	79	46	33
పేషెంట్‌కేర్	24	05	19

అసలేం జరిగిందంటే..
2021 సంవత్సరంలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో 247 పోస్టులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో 144 స్టాఫ్ నర్సులు, 79 మంది టెక్నికల్ సిబ్బంది, 11 అసోసియేట్ ప్రొఫెసర్లు, ఇతర పోస్టులు ఉన్నాయి. మహాలక్ష్మి ఏజెన్సీ, జీపీ ఇన్ఫోటెక్, ఎలైన్, దుర్గం సొసైటీల నుంచి సిబ్బందిని తీసుకున్నారు. టెక్నికల్ సిబ్బందికి నెలకు వేతనం రూ.22,750 చొప్పున, పేషెంట్‌కేర్‌కు రూ.15,600, అసోసియేట్ ప్రొఫెసర్‌కు రూ.లక్ష 50వేలు ఏజెన్సీల ద్వారా చెల్లిస్తున్నారు. 2021 నుంచి 2025 మార్చి వీరిని కొనసాగించారు. ఏప్రిల్‌లో వీరిని రెన్యూవల్ చేయాల్సి ఉండగా, ఈసారి కొంత ఆలస్యమైంది. జూన్ 29న రెన్యూవల్ చేసిన వారి వివరాలను రిమ్స్‌కు పంపించారు.

డీఎంఈకి లేఖ రాసినా స్పందన కరువు..
రెన్యువల్ లభించని పోస్టులను కొనసాగించాలని రిమ్స్ అధికారులు ఇప్పటికే రెండుసార్లు డీఎంఈకి లేఖ రాసినప్పటికీ వారి నుంచి స్పందన కరువైంది. వర్షాకాలం కావడంతో ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. ఈ సిబ్బంది తొలగింపుతో రిమ్స్‌కు వచ్చే రోగులకు ఇబ్బందులు తలెత్తే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం రెన్యూవల్ అయిన ఉద్యోగుల వివరాలను ఏజెన్సీలకు అందజేశారు. ఎవరిని తొలగించాలి.. ఎవరిని కొనసాగించాలనేది వారికి కూడా ఇబ్బందికరమే. అలాగే ప్రభుత్వం మార్చి వరకే రెన్యూవల్ చేసింది. ఏప్రిల్ నుంచి జూన్ వరకు వేతనాలు చెల్లించాల్సి ఉంది. దీంతో రిమ్స్ అధికారులతో పాటు ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలు, ఉద్యోగులు మల్లగుల్లాలు పడుతున్నారు. ఇద్దరు అసోసియేట్ ప్రొఫెసర్లకు సంబంధించి ఎవరిని తొలగిస్తారనేది తెలియడం లేదు. జూనియర్లను తొలగిస్తారా.. లేక ఆయా విభాగాల్లో ఎక్కువ పోస్టులు ఉన్నవాటిలో నుంచి కుదిస్తారా అనేది తేలాల్సి ఉంది.

ప్రభుత్వానికి లేఖ రాశాం..
ఈఏడాది ఔట్‌సోర్సింగ్ పోస్టుల్లో 33 టెక్నీషియన్, 19 పేషెంట్‌కేర్, 2 అసోసియేట్ ప్రొఫెసర్లకు సంబంధించి రెన్యూవల్ కాలేదు. ఈ విషయమై ప్రభుత్వానికి లేఖ రాయడం జరిగింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు చేపడతాం. ఈ వివరాలను ఆయా ఏజెన్సీలకు తెలియజేయడం జరిగింది.
– జైసింగ్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్

అర్హులందరికీ రేషన్‌కార్డులు

- కలెక్టర్ రాజర్షి షా



లబ్ధిదారుకు కొత్త రేషన్‌కార్డు పత్రం అందిస్తున్న కలెక్టర్ రాజర్షి షా, ఎమ్మెల్యే పాయల్ శంకర్

జైనథ్: అర్హులైన ప్రతీ ఒక్కరికి రేషన్‌కార్డు అందేలా చూస్తామని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. స్థానిక లక్ష్మీ నారాయణ స్వామి ఆలయ ప్రాంగణ మండపంలో మంగళవారం జైనథ్, బోరజ్, సాత్నాల, బేల మండలాలకు సంబంధించిన కొత్త రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి ఆయన లబ్ధిదారులకు కార్డులు అందించారు.కలెక్టర్ మాట్లాడుతూ.. రేషన్‌కార్డుల ప్రక్రియ నిరంతరం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నరసయ్య, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో స్రవంతి, డీఎస్‌వో వాజిద్ అలీ, తహసీల్దార్లు ఆత్రం నారాయణ, రాజేశ్వరి, విశ్వనాథ్, రఘునాథ్, ఎంపీడీవో మహేశ్‌కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండల కేంద్రంలోని పశువుల ఆసుపత్రిని కలెక్టర్ తనిఖీ చేశారు. మౌలిక వసతులపై ఆరా తీశారు.

సన్న బియ్యం సద్వినియోగం చేసుకోవాలి
భీంపూర్:ప్రభుత్వం అందజేసే సన్నబియ్యంను రేషన్ కార్డుదారులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. స్థానిక రైతువేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన 200 మందికి కొత్త రేషన్ కార్డులను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌తో కలిసి అందజేశారు. అనంతరం వన మహోత్సవంలో భాగంగా కేజీబీవీ ఆవరణలో మొక్కలు నాటారు. ఇందులో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో స్రవంతి, డీఎస్‌వో వాజిద్ అలీ, తహసీల్దార్ నలంద ప్రియ, అధికారులు, మండల నాయకులు పాల్గొన్నారు. అనంతరం స్థానిక అంగన్‌వాడీ కేంద్రంను కలెక్టర్ సందర్శించారు. చిన్నారుల హాజరు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే పీఏసీఎస్ కేంద్రంలోని యూరియా స్టాక్ వివరాలు పరిశీలించారు.

సర్వేయర్ శిక్షణార్థుల 'ప్రాక్టికల్' పరిశీలన
ఆదిలాబాద్: జిల్లాలో లైసెన్స్‌డ్ సర్వేయర్ శిక్షణలో భాగంగా ఏరోడ్రాం మైదానంలో నిర్వహిస్తున్న ప్రాక్టికల్ పరీక్షలను కలెక్టర్ రాజర్షి షా మంగళవారం పరిశీలించారు. శిక్షణ వివరాలను సంబంధిత అధికారులు కలెక్టర్‌కు వివరించారు.

ఇన్‌స్పైర్‌కు అధిక నామినేషన్లు చేయించాలి
ఆదిలాబాద్‌టౌన్: ఇన్‌స్పైర్ సైన్స్ మేళాకు ఉపాధ్యాయులు అధిక నామినేషన్లు చేయించాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మంగళవారం కలెక్టర్ సమావేశ మందిరంలో ఇన్‌స్పైర్ మేళా పోస్టర్ ఆవిష్కరించారు. ప్రతీ పాఠశాల నుంచి దరఖాస్తులు చేయించాలని సూచించారు. సెప్టెంబర్ 15 వరకు గడువు ఉందని పేర్కొన్నారు. ఇందులో ట్రెయినీ కలెక్టర్ సలోని, డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి భాస్కర్, సెక్టోరియల్ అధి కారి రఘురమణ, ఎంఈవోలు, హెచ్ఎంలు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతి..
జీవో నం.33ను అమలు చేయాలని నీట్ పేరెంట్స్ కమిటీ సభ్యులు కోరారు. మంగళవారం కలెక్టర్ రాజర్షిషాను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. వైద్య విద్యలో తెలంగాణ విద్యార్థులకు సీట్లు కేటాయించాలని కోరారు. ఇతర రాష్ట్రాల వారికి కేటాయించడంతో ఇక్కడి వారు అన్యాయానికి గురవుతున్నారన్నారు. వినతి పత్రం సమర్పించిన వారిలో సత్యనారాయణ, సతీశ్, సంతోష్ తదితరులున్నారు.

'సీజనల్'పై అప్రమత్తంగా ఉండాలి

- వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్
- రిమ్స్, ఉట్నూర్ ఆస్పత్రుల తనిఖీ



రిమ్స్‌లో రికార్డులు పరిశీలిస్తున్న కమిషనర్

ఆదిలాబాద్‌టౌన్: సీజనల్ వ్యాధులపై వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిని మంగళవారం తనిఖీ చేశారు. పలు వార్డులను పరిశీలించారు. డెంగీ బాధితులను పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైద్యసేవలపై ఆరా తీశారు. వైద్యులు సమయపాలన పాటించి రోగులకు నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు. అనంతరం క్రోమ్ ఆస్పత్రిలో రికార్డులను పరిశీలించారు. విజిట్‌కు వచ్చే వైద్యుల వివరాలను డీఎంహెచ్‌వో కార్యాలయంలో నమోదు చేయాలని ఆదేశించారు. ఆయన వెంట రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, డీసీహెచ్ఎస్ ఉపేందర్, వైద్య సిబ్బంది ఉన్నారు.

రిమ్స్ సేవలపై కమిషనర్‌కు ఫిర్యాదు
రిమ్స్‌లో రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందడం లేదని వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్ కుమార్‌కు ఏబీవీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. రిమ్స్ తనిఖీకి వచ్చిన కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. పీజీ వైద్యులు, సీఎంవో సమయపాలన పాటించడం లేదని, రోగులకు సరిగా సేవలు అందించడం లేదని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. టి–హబ్ ద్వారా కేవలం పది రకాల పరీక్షలు మాత్రమే జరుగుతున్నాయని తెలిపారు. ఇందులో ఏబీవీపీ నాయకులు కార్తీక్, అజయ్, శశి ఉన్నారు.

మెరుగైన వైద్య సేవలందించండి
ఉట్నూర్‌రూరల్: ఏజెన్సీ పరిధిలో ఉట్నూర్ కేంద్రంగా ఉన్న ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్ సిబ్బందిని ఆదేశించారు. మండల కేంద్రంలోని జిల్లా ఆస్పత్రిని మంగళవారం ఆయన సందర్శించారు. వార్డులను పరిశీలించారు. రోగులతో మాట్లాడారు. అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్య సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలన్నారు. సీజనల్ వ్యాధులు పొంచి ఉన్న నేపథ్యంలో ప్రతీ ఒక్కరూ విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయన వెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ జాదవ్ ఉపేందర్, వైద్యఆరోగ్య అధికారులు, వైద్యులు మహేందర్, కపిల్, సిబ్బంది ఉన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి
తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ ఆధ్వర్యంలో సిబ్బంది కమిషనర్‌ను కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. పెండింగ్ వేతనాలు చెల్లించేలా చూడాలని కోరారు. ఇందులో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనకంటి సుభాష్ తదితరులున్నారు.

'సర్దుబాటు' అయ్యేదెప్పుడో?

- సవరణ పేరిట కాలయాపన
- పక్షం గడిచినా పూర్తికాని ప్రక్రియ
- విద్యార్థులకు తప్పని తిప్పలు

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ ఎటూ తేలడం లేదు. ఈనెల 15న సర్దుబాటు చేస్తూ ఉపాధ్యాయుల వివరాలను విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. ప్రక్రియలో తప్పిదాలపై 'సర్దుబాటు గందరగోళం' శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. ఈ మేరకు ఉపాధ్యాయ సంఘాల నాయకులు కలెక్టర్‌తో పాటు డీఈవోను కలిసి విన్నవించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా విద్య శాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. గతనెల 18న ఇద్దరు ఎంఈవోలు, ఒక ఏఎస్ఓ, ఇద్దరు ప్రధానోపాధ్యాయులతో ప్రక్రియలో జరిగిన తప్పిదాలను సవరించేందుకు చర్యలు చేపట్టారు. పక్షం రోజులు గడిచినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. సవరణ పేరిట కాలయాపన చేయడంతో అక్కడేం జరుగుతుందోనన్న అనుమానాలు ఉపాధ్యాయుల్లో వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే పాఠశాలలు ప్రారంభమై దాదాపు రెండు నెలలు కావస్తున్నా ఈ ప్రక్రియ ఎటూ తేలడం లేదు. దీంతో విద్యార్థులకు సరైన రీతిలో విద్యాబోధన జరగకపోవడంతో వారు నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

వివరాల వెల్లడిలో జాప్యం..
ఉపాధ్యాయుల సర్దుబాటులో భాగంగా తొలి జాబితాలో 142 మందిని సర్దుబాటు చేశారు. అయితే ఈ సర్దుబాటులో సీనియర్, జూనియర్ అనే తేడా లేకుండా ఇష్టారీతిన కేటాయించారని, స్పెషల్ కేటగిరీని పరిగణలోకి తీసుకోలేదని, రిటైర్మెంట్‌కు దగ్గర ఉన్నవారిని కూడా సర్దుబాటులో మరో పాఠశాలకు పంపించారని, తెలుగు మీడియం ఉపాధ్యాయులను ఉర్దూ మీడియం పాఠశాలలకు కేటాయించారని, ఇలా 140 వరకు ఫిర్యాదులు వచ్చాయి. వీటి సవరణ కోసం జూలై 18 నుంచి కమిటీ సభ్యులు పరిశీలించారు. 27న జాబితాను విద్యాశాఖ అధికారులకు సమర్పించారు. అయితే సవరణలు పూర్తయినప్పటికీ అధికారులు మాత్రం వివరాలు వెల్లడించడం లేదు. ప్రస్తుతం 131మంది ఉపాధ్యాయులను సర్దుబాటు చేసినట్లు అధికారులు మౌఖికంగా పేర్కొంటున్నారు. వీటిలో 111 మందిని మైదాన ప్రాంతం నుంచి మైదాన ప్రాంతానికి, 20 మందిని ఏజెన్సీ ప్రాంతం నుంచి మైదాన ప్రాంతానికి సర్దుబాటు చేసినట్లు చెబుతున్నారు. అయితే ఉపాధ్యాయ సంఘాల నాయకులతో చర్చించిన తర్వాత ప్రకటిస్తామని పేర్కొంటున్నారు. కాగా, ఈ విషయమై డీఈవోను ఫోన్‌లో సంప్రదించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

క్లుప్తంగా

కోర్టులో లొంగిపోయిన నిందితుడు

ఆదిలాబాద్‌టౌన్‌: ఎగ్జిబిషన్‌ యజమానిని బెదిరించిన ప్రధాన నిందితుడు రోహిత్‌ షిండే మంగళవారం ఆదిలాబాద్‌ కోర్టులో లొంగిపోయాడు. వన్‌టౌన్‌ సీఐ సునీల్‌కుమార్‌ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్‌ పట్టణంలోని వన్‌టౌన్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో ఎగ్జిబిషన్‌ యజమాని నుంచి డబ్బులు వసూలు చేసిన కేసులో రోహిత్‌ షిండేపై కేసు నమోదైంది. ఈ మేరకు అతడు లొంగిపోగా కోర్టు 14రోజుల జ్యుడీషియల్‌ రిమాండ్‌ విధించగా జైలుకు తరలించారు. నిందితుడిపై నేరడిగొండ, తాంసి ఠాణాల్లో పలు కేసులు నమోదైనట్లు సీఐ పేర్కొన్నారు.

ఒకరిపై చీటింగ్‌ కేసు

ఇచ్చోడ: మండల కేంద్రంలో డెయిరీఫామ్‌ నిర్వహిస్తున్న చెన్నవార్‌ అభిషేక్‌పై చీటింగ్‌ కేసు నమోదు చేసినట్లు ఇచ్చోడ సీఐ రాజు తెలిపారు. మండల కేంద్రానికి చెందిన అక్కెనపెల్లి రాజు వద్ద రూ.4.50 లక్షలు అప్పు తీసుకుని అభిషేక్‌ పరారీ కాగా, బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అభిషేక్‌ మరి కొందరి వద్ద రూ.33 లక్షల వరకు అప్పులు తీసుకున్నట్లు తెలిపారు. అతడి చేతిలో మోసపోయిన బాధితులుంటే నేరుగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

బావిలో పడిన కుక్కను కాపాడిన అగ్నిమాపక సిబ్బంది


వలతో కుక్కను తీస్తున్న సిబ్బంది, యువకులు

కాసిపేట: మండలంలోని కోమటిచేనులో బావిలో పడిన కుక్కను మంగళవారం అగ్నిమాపక సిబ్బంది కాపాడారు. నాలుగురోజుల క్రితం కాసిపేట–2 ఇంక్‌లైన్‌ గనికి వెళ్లే దారిలోని పాడుబడిన బావిలో కుక్క ప్రమాదవశాత్తు పడిపోయింది. కుక్కను చూసిన స్థానిక యువకులు అగ్నిమాపకశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఫైరింజన్‌తో వచ్చిన సిబ్బంది వల సాయంతో కుక్కను బయటకు తీశారు. ఫైర్‌ ఎస్‌ఎఫ్‌వో సత్యనారాయణ, లీడింగ్‌ ఫైర్‌మన్‌ రవికుమార్‌, డీవోపీ ప్రభాకర్‌, ఫైర్‌మన్‌ వేణుగోపాల్‌, స్థానిక యువకులు పాల్గొన్నారు.

12 టీఎంసీలకు చేరువలో ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌


జలకళ సంతరించుకున్న ప్రాజెక్ట్‌

మంచిర్యాలరూరల్‌(హాజీపూర్‌): ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌ 12 టీఎంసీల నీటి మట్టానికి చేరువలో ఉంది. ఐదురోజుల్లోనే ఏకంగా ఐదు టీఎంసీల నీటిమట్టం పెరిగింది. మంగళవారం మంచిర్యాల మున్సిపల్‌ కార్పొరేషన్‌ పరిధి గుడిపేట వద్ద గల ఎల్లంపల్లి (శ్రీపాదసాగర్‌) ప్రాజెక్ట్‌ నీటిమట్టం వివరాలిలా ఉన్నాయి. 148 మీటర్ల క్రస్ట్‌ లెవెల్‌ కాగా, 144 మీటర్లకు చేరింది. 20.175 టీఎంసీలకు 11.500 టీఎంసీల నీటి సామర్థ్యంతో ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 440 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉండగా, అవుట్‌ ఫ్లో కింద హైదరాబాద్‌ మెట్రోవాటర్‌ వర్క్స్‌ సుజల స్రవంతి పథకానికి 319 క్యూసెక్కులు, ఎన్టీపీసీకి 121 క్యూసెక్కులు తరలుతోంది.

‘మధ్యాహ్నం’ ఎప్పుడో!

- అవస్థల్లో ఇంటర్‌ విద్యార్థులు
- అల్పాహారం తిని కాలేజీలకు..
- ఖాళీ కడుపుతో తిరిగి ఇళ్లకు..
- అర్ధాకలితో అలమటిస్తున్న వైనం


చెన్నూర్‌ ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో విద్యార్థులు (ఫైల్‌)

చెన్నూర్‌: ప్రభుత్వ జూనియర్‌ కళాశాలల్లో ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకం అమలు చేయడం లేదు. దీంతో గ్రామీణ విద్యార్థులు అర్ధాకలితో చదువులు కొనసాగిస్తున్నారు. జిల్లాలో వేలాదిమంది గ్రామీణ విద్యార్థులు పట్టణ ప్రాంతాల్లోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాలల్లో విద్యాభ్యాసం చేస్తూ నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. ఉదయం అల్పాహారం తీసుకుని ఇంటి నుంచి కళాశాలలకు వస్తున్న విద్యార్థులు తిరిగి ఇంటికి వెళ్లే సరికి సాయంత్రం 6గంటలవుతోంది. అప్పటివరకు భోజనం లేక నీరసించి పోతున్నారు. ప్రతీ కళాశాలలో 100–200 మందికి పైగా విద్యార్థులుండగా హాజరు శాతం అంతంత మాత్రంగా ఉంటోందని అధ్యాపకులు చెబుతున్నారు. ఇందులో గ్రామీణ విద్యార్థులే ఎక్కువ సంఖ్యలో ఉన్నట్లు తెలిపారు.

జిల్లాల వారీగా ప్రభుత్వ కళాశాలలు, విద్యార్థుల వివరాలు

జిల్లా	కళాశాలలు	ప్రథమ	ద్వితీయ	మొత్తం
మంచిర్యాల	10	2,160	1,850	4,010
ఆదిలాబాద్‌	13	3,100	3,506	6,606
నిర్మల్‌	15	2,517	2,469	4,977
కు.ఆసిఫాబాద్‌	11	1,645	2,535	4,180

గతంలో దాతల సాయంతో..

మంచిర్యాల జిల్లాలోని చెన్నూర్‌ నియోజకవర్గంలో 2015 నుంచి 2017 వరకు అప్పటి ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, 2019లో అప్పటి ఎమ్మెల్యే బాల్క సుమన్‌ మధ్యాహ్న భోజన సౌకర్యం కల్పించి గ్రామీణ ఇంటర్‌ విద్యార్థుల ఆకలి తీర్చారు. కరోనా వచ్చిన తర్వాత ఈ కార్యక్రమం నిలిచిపోయింది. గత ఎమ్మెల్యేల మాదిరిగా దాతలు ముందుకువచ్చి జూనియర్‌ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

ఇంటికి వెళ్లేసరికి రాత్రవుతోంది



మాది చెన్నూర్‌ మండలం చింతలపల్లి గ్రామం. ఉదయం టిఫిన్‌ తిని కళాశాలకు వచ్చి ఇంటికి తిరిగి వెళ్లేసరికి రాత్రి అవుతోంది. మధ్యాహ్నం భోజనం లేదు. ప్రభుత్వ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తే బాగుంటుంది. – సాయిరాం, విద్యార్థి

ఇప్పటికైనా అమలు చేయాలి



మాది భీమారం మండలం ముల్కలపేట. ఇంటర్‌ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తామని ప్రభుత్వాలు చెబుతున్నాయి. కానీ, ఆచరణలో పెట్టిన దాఖలాలు లేవు. ఇప్పటికైనా మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలి. – మెసినేని సౌజన్య, విద్యార్థిని

దాతలు ముందుకురావాలి



ప్రభుత్వం జూనియర్‌ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేసే వరకు దాతలు ముందుకు వస్తే బాగుంటుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు కళాశాలలో అర్ధాకలితో అలమటిస్తున్నాం. చదువుపై శ్రద్ధ పెట్టలేకపోతున్నాం. – విఘ్నేశ్వర్‌, విద్యార్థి

‘నాగోబా’కు నీరా‘జనం’


నాగోబా దర్శనం కోసం ఆలయం ఎదుట క్యూలైన్‌లో బారులుతీరిన భక్తులు

ఇంద్రవెల్లి: నాగుల పంచమి సందర్భంగా ఆదివాసీ ఆరాధ్యదైవం కేస్లాపూర్‌ నాగోబా ఆలయం మంగళవారం భక్తజన సంద్రమైంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భారీసంఖ్యలో భక్తులు వచ్చి గంటల తరబడి క్యూలైన్లలో నిల్చుని నాగోబాను దర్శించుకున్నారు. ఆదిలాబాద్‌ మాజీ ఎంపీ, రాజ్‌గోండ్‌ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు సోయం బాపూరావ్‌ ఆలయంలో పూజలు చేశారు. అనంతరం మెస్రం వంశీయులు అతడిని శాలువాలతో సన్మానించారు. మెస్రం వంశీయులు భక్తులకు జొన్న గట్కాతో కూడిన ప్రసాదం పంపిణీ చేశారు. ఆలయ ఆవరణలో వెలిసిన దుకాణాల వద్ద సందడి నెలకొంది. ఆలయ ప్రాంగణంలో శ్రీనాగోబా యూత్‌ ఆధ్వర్యంలో కబడ్డీ, వాలీబాల్‌ పోటీలు నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ట్రాఫిక్‌ సమస్య తలెత్తకుండా, అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్‌, మెస్రం వంశీయులు మెస్రం కోసేరావ్‌, నాగ్‌నాథ్‌, మెస్రం శేఖర్‌ బాబు, దేవ్‌రావ్‌, వంశ పెద్దలు మెస్రం బాదిరావ్‌, ఆనంద్‌రావ్‌ తదితరులు పాల్గొన్నారు.


సోయం బాపూరావ్‌తో మెస్రం వంశీయులు


మైసమ్మకు పూజలు చేస్తున్న భక్తులు


నాగోబా విగ్రహానికి పూజలు చేస్తున్న భక్తులు

నకిలీ ఆయుర్వేదిక్‌ అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్‌


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అఖిల్‌ మహాజన్‌


స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు

- ఎనిమిదిమంది నిందితుల అరెస్ట్‌
- ఆరు ద్విచక్రవాహనాలు స్వాధీనం
- 15 సెల్‌ఫోన్లు, మందులు కూడా..
- వెల్లడించిన ఎస్పీ అఖిల్‌ మహాజన్‌

ఆదిలాబాద్‌టౌన్‌: నకిలీ ఆయుర్వేదిక్‌ వైద్యంతో మోసగిస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను అరెస్ట్‌ చేసినట్లు ఎస్పీ అఖిల్‌ మహాజన్‌ తెలిపారు. తొమ్మిది మందిపై కేసు నమోదు చేసి ఎనిమిది మందిని అరెస్ట్‌ చేయగా ఒకరు పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రధాన నిందితుడి కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలిస్తున్నట్లు తెలిపారు. ఆరు ద్విచక్రవాహనాలు, 15 ఫోన్లు, సిమ్‌ కార్డులు, నకిలీ ఆయుర్వేదిక్‌ మందులు, రూ.10వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. బ్యాంక్‌ ఖాతాలో ఉన్న మరో రూ.23వేల నగదు సీజ్‌ చేసినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను మంగళవారం జిల్లా కేంద్రంలోని వన్‌టౌన్‌ పోలీస్‌స్టేషన్‌లో వెల్లడించారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్‌ పట్టణంలో సాయి ఆయుర్వేదిక్‌ మందుల దుకాణం పేరిట కర్ణాటకకు చెందిన ముఠా సభ్యులు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్‌ ఆస్పత్రులు, సూపర్‌ మార్కెట్ల వద్ద అనారోగ్యంతో కనిపించిన బాధితుల వివరాలు సేకరిస్తారు. ఇదే సమస్య ఉన్న తమ కుటుంబీకులను ఆయుర్వేద బాబాకు చూపిస్తే నయమైనట్లు నమ్మిస్తారు. వారి సెల్‌ నంబర్‌ సేకరించి ప్రధాన నిందితుడు కుమార్‌ బాబాకు ఇస్తారు. బాబా సాయంత్రం వారికి ఫోన్‌ చేసి సమస్యకు తన వద్ద పరిష్కారం ఉందని నమ్మిస్తాడు. ముఠాలోని ఓ సభ్యుడిని వారింటికి పంపించి వారిని ఆయుర్వేద దుకాణానికి రప్పిస్తాడు. 5 గ్రాములు, 10 గ్రాముల నకిలీ మూలికలు ఇచ్చి రూ.5వేల నుంచి రూ.10వేల చొప్పున వసూలు చేస్తాడు. జిల్లా పోలీసులు వారి అక్రమాలను బట్టబయలు చేశారు. వీరిపై వన్‌టౌన్‌ పోలీస్‌స్టేషన్‌లో–6, టూటౌన్‌లో–1, మావల పోలీస్‌స్టేషన్‌లో–2 కేసులు నమోదైనట్లు ఎస్పీ తెలిపారు. నిందితుల్లో కర్ణాటకకు చెందిన కుమార్‌ పరారీలో ఉండగా, గాజీపూర్‌కు చెందిన శేఖర్‌ రెడ్‌లైన్‌, ఉగర్‌ఖర్ద్‌కు చెందిన పెంద్రేకుమార్‌, దరావడ్‌కు చెందిన గోలార్‌ సంతోష్‌, గుల్బర్గాకు చెందిన కొడంగల్‌ అమ్రేశ్‌, ఉబ్లికి చెందిన గోలార్‌ ఆనంద్‌, గోగక్‌కు చెందిన యలిగర్‌ హజ్రత్‌, గుల్బర్గాకు చెందిన నగేశ్‌, అనిల్‌కుమార్‌ ఉన్నట్లు పేర్కొన్నారు. సిద్దిపేటలో ఒకరి నుంచి రూ.7లక్షల వరకు వసూలు చేసినట్లు తెలిపారు. ప్రజలు గుర్తింపు పొందిన ప్రభుత్వ, ప్రైవేట్‌ ఆస్పత్రుల్లోనే వైద్యం చేసుకోవాలని సూచించారు. ఆదిలాబాద్‌ డీఎస్పీ జీవన్‌రెడ్డి, వన్‌టౌన్‌, టూటౌన్‌, మావల సీఐలు సునీల్‌కుమార్‌, కరుణాకర్‌రావు, స్వామి ఉన్నారు.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య

కుభీర్‌: మండలంలోని రంజని గ్రామానికి చెందిన జాదవ్‌ సచిన్‌ (24) మద్యానికి బానిసై ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై క్రిష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సచిన్‌ మంగళవారం మద్యం తాగి ఇంటికి రాగా కుటుంబీకులు మందలించారు. దీంతో తాగిన మైకంలో సచిన్‌ తన వ్యవసాయ చేనులో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి చిన్నాన్న శివరాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వాటోలిలో ఉరేసుకుని ఒకరు..

భైంసారూరల్‌: మండలంలోని వాటోలి గ్రామానికి చెందిన బాదోళ్ల మహేశ్‌ (31) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై శంకర్‌, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునే మహేశ్‌ కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. జీవితంపై విరక్తి చెంది సోమవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, కూతురు ఉంది.

జంగుగూడలో మరొకరు..


కృష్ణ మృతదేహం

పెంబి: మద్యం తాగవద్దని భార్య మందలించినందుకు మనస్తాపానికి గురైన భర్త పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై హన్మాండ్లు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని షెట్‌పల్లి పరిధి జంగుగూడ గ్రామానికి చెందిన మోస్రం కృష్ణ (31) మద్యానికి బానిసై ఏ పనీ చేయకుండా తరచూ భార్యతో గొడవపడేవాడు. మద్యం తాగవద్దని భార్య గీత మందలించగా మనస్తాపానికి గురై సోమవారం రాత్రి 11గంటలకు పురుగుల మందు తాగాడు. గుర్తించిన కుటుంబీకులు ఖానాపూర్‌ ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్‌ తెలిపారు. భార్య గీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఉద్యోగం రాలేదని ఉరేసుకున్నాడు


నవీన్‌ మృతదేహం

కెరమెరి(ఆసిఫాబాద్‌): ఉద్యోగం రాలేదని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై మధుకర్‌ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దేవుడ్‌పల్లికి చెందిన జాడి నానాజీ–విమలాబాయి దంపతులకు ముగ్గురు కొడుకులు, ఇద్దరు కూతుళ్లున్నారు. వీరిలో చిన్నవాడు నవీన్‌ (24) ఉన్నత చదువులు చదివాడు. ఇటీవల డీఎస్సీ, ఇతర పోటీ పరీక్షలు రాసినా ఉద్యోగం రాలేదు. దీంతో రోజూ బెంగపడుతుండేవాడు. ఈక్రమంలో సోమవారం ఇంటినుంచి బయటకువెళ్లిన నవీన్‌ సాయంత్రమైనా తిరిగి రాలేదు. అతడి కోసం కుటుంబీకులు వెతకగా సమీపంలోని ఓ చెట్టు కింద శవమై కనిపించాడు. అయితే అతడు చెట్టుకు ఉరేసుకోగా తాడు తెగి బండరాళ్లపై పడ్డట్లు ఆనవాళ్లున్నాయని మృతుడి తండ్రి నానాజీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

- మైనర్‌ మ్యారేజీల నియంత్రణకు చర్యలు
- ‘బాల్య వివాహాల ముక్త్‌ భారత్‌’తో అడ్డుకట్ట వేస్తున్న కేంద్ర ప్రభుత్వం
- ఆసిఫాబాద్‌ జిల్లాలో ప్రత్యేక కార్యక్రమం

జిల్లాలో అధికారులు అడ్డుకున్న బాల్య వివాహాల వివరాలు

సంవత్సరం	అడ్డుకున్న కేసులు
2019	38
2020	29
2021	24
2022	23
2023	18
2024	15
2025	06
మొత్తం	153



పెళ్లి వద్దు.. చదువే ముందు


బెజ్జూర్‌లో బాల్యవివాహం అడ్డుకుని తల్లిదండ్రులకు కౌన్సెలింగ్‌ ఇస్తున్న అధికారులు (ఫైల్‌)

ఆసిఫాబాద్‌: జిల్లాలో తరచూ బాల్యవివాహాలు జరుగుతున్నాయి. నియంత్రణకు ప్రభుత్వం పలు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నా ఫలితం కానరావడంలేదు. నిరక్షరాస్యత, ఆర్థిక వెనుకబాటుతనం, ఆడ పిల్లలకు అభద్రత భావం, పేదరికం, సామాజిక దురాచారాలు, కట్టుబాట్ల కారణంగానే బాల్య వివాహాలు కొనసాగుతున్నాయి. వీటి నియంత్రణకు కేంద్ర ప్రభుత్వం ఓ కార్యాచరణ రూపొందించింది. 2030 నాటికి బాల్యవివాహాల ముక్త్‌ భారత్‌ లక్ష్యంతో ముందుకువెళ్తోంది. ఇందులో భాగంగా రాష్ట్రంలోని కుమురంభీం ఆసిఫాబాద్‌తోపాటు ఖమ్మం, భూపాల్‌పెల్లి జిల్లాలను ఎంపిక చేసింది.

ఏడేళ్లలో 153 వివాహాల అడ్డగింత

బాల్యవివాహాల నియంత్రణలో భాగంగా తాజాగా కేంద్ర మహిళా శిశు సంక్షేమశాఖ ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పురుషుడి వివాహ వయస్సు 21, స్త్రీల వివాహ వయస్సు 18 ఏళ్లు తప్పనిసరి. బాల్య వివాహాలపై తరచూ జిల్లా అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా గ్రామీణ ప్రజల్లో మార్పు రావడంలేదు. ఏటా జిల్లాలో బాల్యవివాహాలు జరుగుతూనే ఉన్నాయి. ముందస్తు సమాచారం అందుకుంటున్న జిల్లా బాలల సంరక్షణ శాఖ ఆధ్వర్యంలో అధికారులు పలు వివాహాలు అడ్డుకున్నారు. గత ఏడేళ్లలో జిల్లా వ్యాప్తంగా 153 బాల్య వివాహాలను అడ్డుకుని వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్‌ ఇచ్చారు.

ప్రత్యేక హబ్‌లుగా..

జిల్లాలో బాల్యవివాహాలు అధికంగా జరుగుతున్న పది గ్రామాలను ఎంపిక చేసి ప్రత్యేక హబ్‌లుగా తీర్చిదిద్దనున్నారు. బాల్యవివాహాలతో కలిగే అనర్థాల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. తద్వారా వీటిని బాల్య వివాహ రహిత గ్రామాలుగా మారుస్తారు. ప్రతీనెల పాఠశాలల్లో డ్రాపౌట్లు, సుదీర్ఘకాలం గైర్హాజరైన బాలికలను గుర్తించి ఆ జాబితాలను అంగన్‌వాడీ టీచర్‌ జిల్లా బాలల సంరక్షణ యూనిట్లకు పంపిస్తారు. గైర్హాజరుకు కారణాలపై విచారణ జరిపిస్తారు.

జిల్లాలో ఇలా..

జిల్లా వ్యాప్తంగా పలు గ్రామాల్లో బాల్యవివాహాలను జిల్లా బాలల సంరక్షణ అధికారి, ఐసీడీఎస్‌ ఆధ్వర్యంలో అడ్డుకుంటున్నారు. జిల్లా కేంద్రంలోని దస్నాపూర్‌, ఆసిఫాబాద్‌ మండలం అంకుసాపూర్‌, గుండి, రెబ్బెన మండలం నారాయణపూర్‌, వంకులం, పర్శనంబాల, వాంకిడి మండలం ఇందాని, పెంచికల్‌పేట్‌ మండలం చెడ్వాయి, బారెగూడ, బెజ్జూర్‌ మండలం నాగుల్‌వాయి, బాబాసాగర్‌, కర్జెల్లి, కాగజ్‌నగర్‌ మండలం బట్టుపెల్లి, చింతగూడ, దహెగాం, చీలపెల్లి గ్రామాల్లో బాల్యవివాహాలను అడ్డుకున్నారు. అధికారుల మాటను నిర్లక్ష్యం చేసిన ముగ్గురిపై కేసులు నమోదు చేశారు.

పకడ్బందీ చర్యలు చేపడుతున్నాం



జిల్లాలో బాల్యవివాహాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నాం. గతంతో పోలిస్తే బాల్యవివాహాల సంఖ్య తగ్గింది. నియంత్రణలో భాగంగా గ్రామ, మండల స్థాయి కమిటీలు వేసి పర్యవేక్షిస్తున్నాం. ఎక్కడైనా బాల్యవివాహం జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే అక్కడికి వెళ్లి ఇరు కుటుంబాలకు కౌన్సెలింగ్‌ ఇచ్చి వివాహాలు నిలిపివేస్తున్నాం. – మహేశ్‌, జిల్లా బాలల సంరక్షణాధికారి

శాంతిఖని గనిలోకి దిగిన డీఎంఎస్‌


గనిలో దిగడానికి సిద్ధమైన డీఎంఎస్‌, జీఎం

బెల్లంపల్లి: మందమర్రి ఏరియా శాంతిఖని భూగర్భ గనిని మంగళవారం డైరెక్టర్‌ ఆఫ్‌ మైన్స్‌ సేఫ్టీ (డీఎంఎస్‌) ఎన్‌.నాగేశ్వరరావు సందర్శించారు. గనిలో దిగి పని స్థలాలు, రక్షణ చర్యలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రమాదరహిత సింగరేణి కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని సూచించారు. బొగ్గు ఉత్పత్తి యాగంలో ఎలాంటి ప్రమాదాలకు ఆస్కారం లేకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఆయన వెంట మందమర్రి ఏరియా సింగరేణి జనరల్‌ మేనేజర్‌ దేవేందర్‌, శాంతిఖని గ్రూప్‌ ఆఫ్‌ మైన్స్‌ ఏజెంట్‌ అబ్దుల్‌ ఖదీర్‌, బాలాజీ భగవంత్‌ ఝా, గని మేనేజర్‌ సంజయ్‌కుమార్‌ సిన్హా, రక్షణ, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

జనగణనలో షెడ్యూల్డ్‌ ట్రైబ్‌ కాలమ్‌ పొందుపరచాలి


గవర్నర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌: 2027లో చేపట్టనున్న జనగణనలో ఆదివాసీలకు సంబంధించి షెడ్యూల్డ్‌ ట్రైబ్‌గా గుర్తించే ప్రత్యేక కాలమ్‌ పొందుపరచాలని రాష్ట్ర గవర్నర్‌ జిష్ణుదేవ్‌వర్మను తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టీఏజీఎస్‌) నాయకులు కోరారు. మంగళవారం హైదరాబాద్‌లో గవర్నర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్‌ మాట్లాడుతూ.. జనగణనలో కాలమ్‌ పొందుపరిచే అంశాన్ని కేంద్రానికి సిఫార్సు చేయాలని విజ్ఞప్తి చేశారు. 50శాతానికి మించి జనాభా ఉన్న ఆదివాసీ గ్రామాలను షెడ్యూల్డ్‌ గ్రామాలుగా గుర్తించాలని కోరారు. ఆదివాసీలకు ప్రత్యేక సంస్కృతి, సంప్రదాయాలున్న నేపథ్యంలో షెడ్యూల్‌ ట్రైబ్‌ మతంగా గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. అనేక సమస్యల నుంచి నాన్‌ షెడ్యూల్డ్‌ గ్రామాలుగా ఉన్న కారణంగా ఆదివాసీ గ్రామాలకు ఐటీడీఏ పథకాలు అందడంలేదని తెలిపారు. ఏజెన్సీ ప్రాంత హక్కులు ఆ ప్రాంతవాసులు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గవర్నర్‌ను కలిసిన వారిలో మాజీ ఎంపీ మీడియం బాబురావు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, నాయకులు రవికుమార్‌, శ్రీరామ్‌, ధర్మ తదితరులున్నారు.

ఎస్సారెస్పీలోకి 65వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

మామడ: ఎగువ కురుస్తున్న వర్షాలకు క్రమంగా శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌ నీటి నిల్వ పెరిగింది. మంగళవారం 65వేల క్యూసెక్కుల వరద చేరింది. ప్రాజెక్ట్‌ పూర్తిస్థాయి నిల్వ 1,091 అడుగులు (80.5 టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 1,076.60 అడుగులు (36.464 టీఎంసీలు) నీటి నిల్వ ఉంది. దీంతో సరస్వతీ ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తంజేస్తున్నారు.

నవోదయలో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగింపు

కాగజ్‌నగర్‌టౌన్‌: జవహర్‌ నవోదయ విద్యాలయంలో 2026–27 విద్యాసంవత్సరానికి ఆరోతరగతిలో ప్రవేశాల కోసం ఈ నెల 29వ తేదీ వరకు ఆన్‌లైన్‌ దరఖాస్తు గడువు ఉండగా ఆగస్టు 13వ తేదీ వరకు పొడగించినట్లు కాగజ్‌నగర్‌ జవహర్‌ నవోదయ విద్యాలయం ప్రిన్సిపల్‌ రేపాల కృష్ణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లాలోని అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. https://cbseitms. rcil. gov. in/ nvs/ వెబ్‌సైట్‌ ఓపెన్‌ చేసి క్యాండిడేట్‌ కార్నర్‌లో రిజిస్ట్రేషన్‌ ఫర్‌ 6వ తరగతి 2026–27ను క్లిక్‌ చేసి అప్లికేషన్‌ ఫాం ఫిల్‌ చేసుకోవాలని ఆయన సూచించారు.

విద్యార్థులకు ల్యాప్‌ట్యాప్‌లు


ల్యాప్‌టాప్‌ అందజేస్తున్న పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్‌: మండలంలోని గిరిజన విద్యార్థులకు ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా మంగళవారం ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గిరిజన విద్యార్థులు ఉన్నత విద్యలో ప్రతిభ కనబరిచి ఆదర్శంగా నిలవాలని సూచించారు. పెంబి మండలం పాశపుల గ్రామానికి చెందిన గుగ్లావత్‌ వామనరావ్‌కు జేఈఈ మెయిన్స్‌ పరీక్షల కోసం, ఉట్నూర్‌ మండలం శంకర్‌తండా గ్రామానికి చెందిన రాథోడ్‌ మనోజ్‌కు ఐటీ చదువుల కోసం వారి తల్లిదండ్రుల సమక్షంలో ల్యాప్‌టాప్‌లు అందజేసినట్లు తెలిపారు. పట్టుదలతో లక్ష్యాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు.

జాతీయ విద్యాసదస్సులో రంగయ్య


ఉత్తమ టీచర్లు, ఇన్నోవేటర్‌ స్టూడెంట్లతో రంగయ్య

కెరమెరి(ఆసిఫాబాద్‌): ఢిల్లీలో మంగళవారం నిర్వహించిన జాతీయ విద్యాసదస్సుల్లో మండలంలోని సావర్‌ఖెడా పీఎంశ్రీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కడేర్ల రంగయ్య పాల్గొన్నారు. అఖిల భారతీయ శిక్షా సమాగం (ఏబీబీఎస్‌) ఐదో వార్షికోత్సవం సందర్భంగా మినిస్ట్రీ ఆఫ్‌ ఎడ్యుకేషన్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సులో ఎన్‌ఈపీ (నేషనల్‌ ఎడ్యుకేషన్‌ పాలసీ) –2020లో ఎలాంటి మార్పులు జరిగాయి, విద్యాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు.. ఏఐ (ఆర్టిఫిషియల్‌ ఇంటెలిజెన్స్‌) గురించి చర్చించినట్లు రంగయ్య తెలిపారు. సదస్సులో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌, వివిధ రాష్ట్రాల మంత్రులు, ప్రొఫెసర్లు, తెలంగాణ రాష్ట్రం నుంచి ఏడుగురు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు, ఐదుగురు ఇన్నోవేటర్‌ స్టూడెంట్స్‌ పాల్గొన్నట్లు పేర్కొన్నారు.